సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



ముగిసిన జాతర
చిన్నమేడారం, యాదాద్రి మేడారం, లక్ష్మక్కపల్లిలో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర ముగిసింది. - 8లో



విశ్వంభర సినిమా షూటింగ్
హాలియా పరిధిలోని పాలెం సమీపంలో వజ్రతేజ రైస్ మిల్లులో చిరంజీవి నటిస్తున్న విశ్వంభర చిత్రం షూటింగ్ జరిగింది. - 8లో



అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్
సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అంతర్ రాష్ట్ర దొంగ పట్టుబడ్డాడు. - 8లో

న్యూస్‌రీల్

యాదాద్రిలో ఆరాధనలు



గజవాహన సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సే చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం , గవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : జాతీయ ఆరోగ్య మిషన్ కింద వైద్యారోగ్య శాఖలో పలు పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నామని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ పరిపూర్ణా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ 2, ఎంఎల్‌హెచ్‌పీఎస్ 14, స్టాఫ్ నర్సు 18, వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ 1, టీబీ హెల్త్ విజిటర్ 1, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలను www. yadadri.telangana .gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను భువనగిరిలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

రేపు ప్రేరణ తరగతులు



మాట్లాడుతున్న బీసీ అభివృద్ధి అధికారి

చౌటుప్పల్ : విద్యార్థులకు సోమవారం చౌటుప్పల్ పట్టణంలోని జయశ్రీ ఫంక్షన్ హాల్‌లో ప్రేరణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి యాదయ్య తెలిపారు. శనివారం చౌటుప్పల్‌లోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చౌటుప్పల్, రామన్నపేట, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి మండలాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ, తెలంగాణ గురుకులాల విద్యార్థుల కోసం ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామని, కలెక్టర్, డీఈఓలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేకాధికారులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

నేడు షబ్ ఎ బరాత్

భువనగిరి : ముస్లింల ప్రధాన పండుగల్లో ఒకటైన షబ్ ఎ బరాత్‌ను ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి మసీదుల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పండుగ రోజు ముస్లింలు రాత్రంతా జాగారం చేసి అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. ఖురాన్ పఠిస్తారు. మరణించిన ఆత్మీయుల సమాధులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

విద్యుత్ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఈ మల్లికార్జున్

భువనగిరి: విద్యుత్ సరఫరా విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని భువనగిరి డీఈ మల్లికార్జున్ హెచ్చరించారు. భువనగిరి పట్టణం, భువనగిరి మండలం, తుర్కపల్లి మండలాల విద్యుత్ సిబ్బందితో శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే లోపాన్ని సవరించి పునరుద్ధరించాలని ఏఈలకు సూచించారు. వ్యవసాయానికి రోజూ సరఫరా చేసే విద్యుత్‌లో ఏదైనా కారణంతో అంతరాయం ఏర్పడితే అన్ని గంటల అదనంగా ఇవ్వాలన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాని కోరారు. సమావేశంలో ఏడీ ఆనంద్‌రెడ్డి, భువనగిరి, భువనగిరి రూరల్, తుర్కపల్లి ఏఈలు సాయి కృష్ణ, వెంకటేశ్వర్లు, భిక్షపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పదవులొస్తున్నాయ్!

మార్కెట్‌లకు నూతన పాలకవర్గాల నియామకానికి కసరత్తు

- రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు
- జిల్లాలో ఐదు వ్యవసాయ మార్కెట్‌లు
- పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు
- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే లోపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం



భువనగిరి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్‌లో పదవుల కోలాహలం నెలకొంది. వ్యవసాయ మార్కెట్‌లకు నూతన పాలకవర్గాలను నియమించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో చాలా మంది నాయకులు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకుంటున్నారు. ముఖ్య నేతల వద్ద ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఐదు మార్కెట్‌లకు నూతన కమిటీలు

జిల్లాలోని ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, మోత్కూరు, వలిగొండ వ్యవసాయ మార్కెట్‌లకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియమించిన పాలకవర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త పాలకవర్గాలను ఎన్నుకోవాలని నిర్ణయించింది. చైర్మన్ పదవులకు సంబంధించి రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు కూడా ఖరారయ్యాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు 18 మంది డైరెక్టర్లతో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

ఎమ్మెల్యేల అనుగ్రహం కోసం ప్రయత్నాలు

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం ఐదు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కాగా నామినేటెడ్ పదవులపై గురిపెట్టిన పలువురు నేతలు ఎమ్మెల్యేల వద్ద పైరవీలు షురూ చేశారు. కొందరు మంత్రి కోమటిరెడ్డి అనుగ్రహం కోసం ప్రయత్నిస్తున్నారు. పదేళ్లు అధికారంలో లేకున్నా తాము పార్టీని వెన్నంటి ఉన్నామని, ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలను ఆశావహులు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

ఎంపిక కత్తిమీద సామే..

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పదవుల కోసం పార్టీ నేతల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. మొదటి నుంచి పార్టీలో ఉన్నవారు, కొత్తగా వచ్చిన నేతల నుంచి ఒత్తిడి మొదలైంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపిక ఎమ్మెల్యేలకు కత్తిమీద సాములా మారింది. అయితే పదేళ్లు అధికారంలో లేకున్నా పార్టీ వెన్నంటి ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

ఆలేరులో అధికంగా ఆశావహులు

జనరల్, బీసీ స్థానాలకు పోటీ తీవ్రంగా ఉంది. జనరల్ మహిళకు రిజర్వు అయిన ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మ పర్సన్ పదవి కోసం ఆలేరుతో పాటు బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, యాదగిరిగుట్ట, మోటకొండూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు పోటీ పడుతున్నారు. అయితే బొమ్మలరామారం మండలానికి చైర్మన్ పదవి ఖరారైనట్లు సమాచారం. చౌటుప్పల్, మోత్కురులో కూడా ఆశావహులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ఆలేరు, తుంగతుర్తి పరిధిలో ఉన్న మోత్కూరు మార్కెట్ చైర్మన్ పదవి ఆలేరు నియోజకవర్గానికి, భువనగిరి, నకిరేకల్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి భువనగిరి నియోజకవర్గానికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే పాలకవర్గాలను నియమించాలని అధిష్టానం నుంచి ఆదేశాలున్నాయి. కాగా జిల్లాలో ఈ నెలాఖరులోపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రిజర్వేషన్లు ఇలా..

భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళ, ఆలేరు ఓసీ మహిళ, వలిగొండ ఎస్టీ జనరల్, చౌటుప్పల్ బీసీ జనరల్, మోత్కూర్ బీసీ మహిళకు రిజర్వు చేశారు. ఎన్నికైనన పాలకవర్గాలు రెండేళ్ల కాలం కొనసాగనున్నాయి.

పట్టభద్రుల ఓటర్లు 31,778 మంది

- ముసాయిదా జాబితా విడుదల
- ఓటరుగా నమోదుకు మార్చి 4వ తేదీ వరకు అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు ముసాయిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే శనివారం విడుదల చేశారు. మొత్తం 31,778 మంది ఓటరుగా నమోదయ్యారు. వారిలో పురుషులు 19,524, మహిళా ఓటర్లు 12,254 మంది ఉన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం మార్చి 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. 29 వరకు దరఖాస్తులను పరిష్కరించి ఏప్రిల్ 4న తుది జాబితాను ప్రకటించనున్నారు.


ఓటు నమోదుకు మరో అవకాశం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. మార్చి 14వ తేదీ వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, పేర్ల తొలగింపుల కోసం తహసీల్దార్ల కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ceotserms2.telangana. gov.in/mlc/form18.aspx లోనూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, ఉడుత భాస్కర్, రత్నాపురం బలరాంరవీందర్‌రెడ్డి, బట్టుపల్లి అనురాధ, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సురేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని కలెక్టరు హనుమంతు కే.జెండగే అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. తాగునీరు, ఉపాధిహామీ పనులు, విశ్వకర్మ యోజన దరఖాస్తులపై మండలాల వారీగా సమీక్షించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కోరారు. బోర్లు, చేతి పంపులు, పైపులైన్‌లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని తాగునీరు అందించాలని కోరారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, గ్రామ అవసరాలకు తగిన పనులను గుర్తించాలని సూచించారు. విశ్వకర్మ యోజన పథకంపై అవగాహన కల్పించి అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ కృష్ణన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భువనగిరి : ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. నిమిషం నిబంధన ఉన్నందున విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు, చిత్రంలో డీసీపీ, న్యాయమూర్తులు

భువనగిరి క్రైం : మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా న్యాయవాదులు, పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు సూచించారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని కేసుల పరిష్కారానికి తీసుకోవల్సిన చర్యలపై సూచనలు చేశారు. 4 వేల క్రిమినల్ కేసులు రాజీపడదగినవిగా గుర్తించినట్లు తెలిపారు. ఆయా కేసులకు సంబంధించిన కక్షిదారులకు నోటీసులు అందజేసి లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతిదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.దశరథ రామయ్య, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సబ్‌జైల్ సూపరింటెండెంట్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు నోటీసులు

భువనగిరి టౌన్ : భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఈనెల 28న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజు ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలియజేస్తూ మున్సిపల్ అధికారులు శనివారం కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు. 35 మంది కౌన్సిలర్లు ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడికి అందజేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు క్యాంపులో ఉండడం, మరికొందరు అందుబాటులో లేకపోవడంతో వారి ఇళ్లకు నోటీసులు అంటించారు. 28న ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

సత్వర న్యాయం అందించాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే



సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యుడీషియల్ ఈ-సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

- కేసుల పరిష్కారానికి అదనపు కోర్టులు మంజూరు
- న్యాయవాదులు వృత్తికి వన్నె తేవాలి
- కోదాడ, సూర్యాపేటలో కోర్టు భవనాలను ప్రారంభించిన చీఫ్ జస్టిస్



కోదాడలో కోర్టు భవనాల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ తదితరులు

కోదాడ అర్బన్, చివ్వెంల(సూర్యాపేట): సామాన్యులకు సత్వర న్యాయం అందించేలా కింది కోర్టులు పనిచేయాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. శనివారం కోదాడలో సబ్ కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ప్రారంభించడంతో పాటు రూ.25కోట్లతో నిర్మిస్తున్న నాలుగు కోర్టుల భవన సముదాయానికి భూమిపూజ చేశారు. అలాగే సూర్యాపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యూడీషియల్ ఈ సేవ కేంద్రాన్ని చీఫ్ జస్టిస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదాడ, సూర్యాపేటలో జిల్లా ప్రధాన జడ్జి, కలెక్టర్, ఎస్పీ, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి చీఫ్ జస్టిస్‌తోపాటు హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కేంద్రంలో చీఫ్ జస్టిస్‌తోపాటు హైకోర్టు న్యాయమూర్తులను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కలిసి సన్మానించారు. కోదాడలో అదనపు కోర్టులను చీఫ్ జస్టిస్ ప్రారంభించగా తొలి కేసును హుజూర్‌నగర్‌కు చెందిన సబ్ కోర్టు జడ్జి పరిశీలించారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి రాజ్‌గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు సత్వరం పరిష్కారానికే న్యాయ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని న్యాయ వ్యవస్థకు వన్నె తేవాలని, సీనియర్, జూనియర్ న్యాయవాదులకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. న్యాయవాద వృత్తి గౌరవప్రదమైనదని తమ స్థానాన్ని నిలబెట్టుకుంటూ కక్షిదారులకు సేవలు అందించాలని పేర్కొన్నారు.

ఆదర్శంగా నిలవాలి

భవిష్యత్ తరాలు న్యాయవాద వృత్తిని స్వీకరించే విధంగా జూనియర్ న్యాయవాదులు ఆదర్శంగా నిలవాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ అన్నారు. అవసరం మేరకు కోదాడలో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేస్తామన్నారు.కోర్టు నిర్మాణానికి పునాది వేయడంతోనే సరిపోదని, త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ పుల్లా కార్తీక్ మాట్లాడారు. జిల్లా జడ్జి స్వాగతోపన్యాసం చేయగా కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర జడ్జిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టులో న్యాయవాద వృత్తి చేపట్టి నాలుగు దశాబ్దాలుగా రాణిస్తున్న యల్కసుధాకర్‌రెడ్డి, ఎస్.రాధాకృష్ణమూర్తిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సత్కరించారు. కోదాడలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని పలు న్యాయస్థానాలకు చెందిన జడ్జిలు, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాహుల్ హెగ్డే, హైకోర్టు పీపీ పల్లె నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం

సూర్యాపేటలో జిల్లా న్యాయమూర్తులతో సమావేశమైన చీఫ్ జస్టిస్ వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కోర్టులో పలు విభాగాల్లో పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ విన్నవించారు. దీనికి స్పందించి చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ.. ఖాళీల భర్తీ అనేది నిరంతర ప్రక్రియ అని, వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఖాళీల వివరాలు పంపించాలని సూచించినట్లు పేర్కొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జడ్జిలకు క్వార్టర్స్ ఏర్పాటు చేయాలని, తుంగతుర్తి కోర్టుకు రెగ్యూలర్ జడ్జిని నియమించాలని బార్ అసోసియేషన్ కార్యవర్గం కోరగా త్వరలో నియమిస్తామని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే పేర్కొన్నారు.



నేత్రపర్వం.. పుష్పయాగం

యాదాద్రి పూర్వగిరీశుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయంలో ఉత్సవమూర్తులకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

పవర్.. భారం కావొద్దు

- పనులు సత్వరం పూర్తికి సమర్థమైన అధికారి అవసరం
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సహకారం తీసుకోవాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- యాదాద్రి పవర్ ప్లాంట్ పనులపై సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎండీ రిజ్వీ, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, ఇతర అధికారులు

మిర్యాలగూడ అర్బన్ : యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయకపోతే అంచనా వ్యయం పెరిగి ప్రభుత్వానికి మోయలేని భారంగా మారుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను శనివారం మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందన్నారు. ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉన్న స్కిల్డ్, అన్ స్కిల్డ్ నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఆలోచించాలన్నారు. త్వరితగతన ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఒక వ్యవస్థను, ఓ సమర్థమైన అధికారిని నియమించుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందని.. గతంలో వీరిద్దరూ ఎంపీలుగా ఈ ప్రాజెక్టు పురోగతికి కృషి చేశారని వివరించారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఇద్దరు మంత్రుల సంపూర్ణ సహకారం తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అంచనా వ్యయం పెరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టు పురోగతిపై చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చినందుకు అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు. అంతకుముందు ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద హెలికాప్టర్ దిగిన ముగ్గురు మంత్రులకు కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు.

మంత్రులకు వినతి

పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న వో అండ్ ఎం కార్మికులను కేటీపీఎస్‌కు బదిలీ చేయాలని టీఆర్‌వీకేఎస్, తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌పీఈయూ) – 1535, 327 యూనియన్ నేతలు మంత్రులకు వినతిపత్రం అందజేశారు. 270 మందికి పైగా కార్మికులను కారణం లేకుండానే పాల్వంచ కేటీపీఎస్ నుంచి బదిలీ చేశారని పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో ఎస్.రవికుమార్ ఎంఏ.నజీర్, డి.రాధాకృష్ణ తదితరులున్నారు.

కాళేశ్వరంతో ప్రజాధనం వృథా..

- నక్కగూడెం లిఫ్ట్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

హుజూర్‌నగర్ : కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రజాధనం వృథా అయ్యిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం మండలం నక్కగూడెంలో రూ 37.70 కోట్లతో లిఫ్ట్ పునరుద్ధరణ పనులకు భారీ నీటి పారుదల, పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలు, రైతులు ఎంతో నష్ట పోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాధనం వృథా కాకుండా కేబినెట్‌లో చర్చించి ప్రజల శ్రమ, సంపద, వనరులు ప్రజలకు దక్కే విధంగా కృషి చేస్తోందన్నారు. నక్కగూడెం లిఫ్ట్ పునరుద్ధరణ ద్వారా ఈ ప్రాంతంలో 3,200 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ లిఫ్ట్ మరమ్మతులకు రూ.37.70 కోట్లు, రోడ్ల వెడల్పు పనులకు రూ.40 కోట్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిదిందన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్ ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో హోం మంత్రిని ప్రగతిభవన్ లోపలికి రాకుండా వెళ్లగొట్టిన చరిత్ర ఉందని.. ఇప్పుడు ప్రజలపాలన సాగుతుందన్నారు. లిఫ్టల ద్వారా సాగు గణనీయంగా పెరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని లింగగిరి – యాతవాకిళ్లకు రోడ్డు రూ.20 కోట్లు, దొండపాడు – రామాపురం క్రాస్‌రోడ్డు వరకు రోడ్డు పనులకు రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో ఈ రోడ్ల పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్‌హెగ్డే, నీటి పారుదల చీఫ్ ఇంజనీర్ రమేష్, ఎస్ఈ నర్సింహారావు, అదనపు కలెక్టర్ ఏ.వెంకట్‌రెడ్డి, అదనపు ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.



నక్కగూడెంలో లిఫ్టు పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి, చిత్రంలో ఉత్తమ్, కోమటిరెడ్డి

క్లుప్తంగా

ఇద్దరు దొంగల అరెస్ట్

నార్కట్‌పల్లి : గొర్రెలను చోరీ చేసిన దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన రేగట్టే భూపాల్ రెడ్డికి ఎల్లారెడ్డిగూడెంలోని వ్యవసాయ భూమిలో షెడ్డు వేసి 110 గొర్రెలను ఏడాది నుంచి సూపర్ వైజర్ ఏర్పాటు చేసి పెంచుతున్నాడు. ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి హైదరాబాద్‌కు చెందిన దోంతుల పవన్‌కళ్యాణ్, సయ్యద్ అజామ్‌లు రెండు డీసీఎంలలో గొర్రెలను చోరీ చేశారు. వాటిని హైదరాబాద్‌లోని షరీఫ్‌నగర్‌లో దాచి ఉంచగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నేరస్తులను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వృద్ధురాలు మృతిచెందింది. చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ఎర్రగుంట లింగస్వామి తన తల్లి ఎర్రగుంట ఊషమ్మ(72)తో కలిసి నారాయణపురం మండలం సర్వేల్ గ్రామం నుండి ఈనెల 21న ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో దామెర గ్రామ స్టేజీ వద్ద చలమల్ల కృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయం సమీపంలో ఎదురుగా కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో లింగస్వామి ఒక్కసారిగా బైక్‌కు బ్రేక్ వేశాడు. అప్పటికే ద్విచక్ర వాహనం అతివేగంగా ఉండడంతో వెనుక కూర్చున్న అతని తల్లి బైక్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడిపోయింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు




గాయపడిన సైదా, షాహిదాబేగం

మునగాల: రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మునగాల మండల కేంద్రం శివారులో శనివారం జరిగింది. మునగాల మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు షేక్ సైదా భార్య షాహిదాబేగంతో ద్విచక్ర వాహనంతో కోదాడలో ఉన్న తమ కూతూరు ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో స్థానిక పెట్రోలు బంకు ఎదురుగా వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లింది.ప్రమాదానికి కారణమైన లారీని స్థానికులు వెంబడించి రెండు కి.మీ దూరంలో పట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108వాహనంలో కోదాడకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బంధువులు ఖమ్మం పట్టణం తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు.

పూర్వగిరిలో శ్రీచక్రస్నానం

- చక్రతీర్థానికి తరలివచ్చిన భక్త జనులు
- ఉదయం పూర్ణాహుతి.. రాత్రి దేవతోద్వాసన
- నేడు శతఘటాభిషేకంతో ఉత్సవాల ముగింపు



స్వామివారికి చక్రతీర్థ స్నానం కలశం తీసుకెళ్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నిత్యారాధనల అనంతరం పారాయణికులచే చతుర్వేద పారాయణం, యాజ్ఞీకులచే నిత్య హవనం, మూల మంత్ర, మూర్తి మంత్ర జపములు నిర్వహించారు. ఉదయం 9గంటలకు పూర్ణాహుతి మహోత్సవం పాంచరాత్ర ఆగమ రీత్యా అత్యంత వైభవంగా జరిపించారు. బ్రహ్మోత్సవముకు విచ్చేసిన దేవ కోటికి కృతజ్ఞత పూర్వకంగా నిత్య హవనముల ద్వారా హవిస్సులు సమర్పించి, అనుగ్రహం పొందేందుకు ప్రార్థించారు. అనంతరం మధ్యాహ్నాం 12గంటలకు చక్రతీర్థ మహోత్సవం ఆలయ పుష్కరిణిలో ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, అర్చక బృందం, పారాయనికులు అత్యంత వైభవం జరిపించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చక్ర ఆళ్వారుడితో..

మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి శనివారం ఉదయం 10.30గంటలకు విశేషంగా పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పాతగుట్ట ఆలయ తిరువీధుల్లో 11గంటలకు ఊరేగింపుగా శ్రీచక్రాన్ని, స్వామి వారి సేవను తీసుకెళ్లి, మధ్యాహ్నాం 12గంటలకు మెట్ల మార్గంలో వెళ్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో శ్రీచక్రతీర్థ స్నానం నిర్వహించారు. తొలుత శ్రీచక్ర ఆళ్వారునికి అలంకరించి, ప్రత్యేక పల్లకిపై అధిష్ఠింపజేసి పూజలు చేశారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పుష్కరిణిలో శ్రీచక్ర స్నానం చేసిన అనంతరం ఆ నీటిని తీసుకెళ్లడానికి భక్తులు పోటీ పడ్డారు. పలువురు భక్తులు పుష్కరిణిలోనే స్నానాలు చేశారు.

రాత్రి వేళ శ్రీపుష్పయాగం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి ఆలయంలో రాత్రి నిత్య ఆరాధనల అనంతరం దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం వేడుకలను ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యాజ్ఞచార్యులు, పారాయణికులచే జరిపించారు. అనంతరం ఉత్సవ నిర్వహణకై ఆహ్వానింపబడిన సకల దేవతలను ఈ దేవతోద్వాసన మంత్రముతో వారి వారి స్థానాలకు భక్తి పూర్వకంగా వేంచేపు చేశారు. ఇక భగవానుని ఆరాధించు ప్రక్రియలలో భగవానుడికి అత్యంత ప్రీతి పాత్రమైన వేడుకగా పుష్పోత్సవంను జరిపించారు. అనంతరం డోలోత్సవ వేడుకను అత్యంత వైభవంగా జరిపించారు. శ్రీస్వామి అమ్మవారిని వేంచేపు చేసి భక్తి భరిత కీర్తనలతో ఊయలను ఊపుతూ ఈ వేడుకను నిర్వహించారు.



స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న అధికారులు

నేడు ఉత్సవాలు ముగింపు

పాతగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగియనున్నాయి. ఉదయం 10గంటలకు శ్రీస్వామి వారి శతఘటాభిషేకం, మధ్యాహ్నాం 1గంటలకు మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలను ఆచార్యులు, అధికారులు పరిసమాప్తం చేయనున్నారు.

ఎస్‌ఐపై దాడి.. వాహనం ధ్వంసం

- గొర్రెలు విక్రయించిన డబ్బులు చెల్లించడంలో వాగ్వాదం
- ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడి, గాయాలు

చందంపేట: నల్లగొండ జిల్లా చందంపేట పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్‌ఐ సతీష్‌తో పాటు వారి సిబ్బందిపై వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టన పరిధి చిన్నయ్యగారిపల్లెలో ఇటీవల దాడి జరిగింది. చందంపేట మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన టేకులపల్లి అంజయ్య, నేలపట్ల ఆంజనేయులు, మామిళ్ల సైదులు, పిల్లి అంజయ్య, వెంకటయ్య, ఆంజనేయులు మరో ఇద్దరు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప వైఎస్సార్ జిల్లాలోని మైదుకూరు మండలం చిన్నయ్యగారిపల్లికి చెందిన ఓబుగాని సాంబయ్య అతని కుమారుడు ఓపగాని శివలకు విడతల వారీగా రూ.54.50లక్షల విలువైన గొర్రెలను గత ఏడాది డిసెంబర్ నెలలో విక్రయించారు. ఒప్పందం మేరకు డబ్బులు చెల్లించకపోవవడంతో రెండుమార్లు గొర్రెలు విక్రయించిన వారు చిన్నయ్యగారిపల్లి గ్రామానికి వెళ్లి సాంబయ్య, శివలను డబ్బుల విషయమై నిలదీశారు. దీంతో డబ్బులు ఇచ్చేందుకు సమయం కావాలని కోరడంతో గడువు ఇచ్చారు. ఇచ్చిన గడువు దాటిపోవడంతో గొర్రెలు విక్రయించిన వారు చందంపేట పోలీస్ స్టేషన్‌లో ఓబుగాని సాంబయ్య, అతని కుమారుడు శివలపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే క్రాంతికుమార్ బదిలీ కావడంతో చందంపేట ఎస్‌ఐగా నియమితులైన సతీష్ కేసు విచారణ నిమిత్తమై ఈనెల 22న గురువారం రోజున ఆంధ్రప్రదేశ్ జిల్లా మైదుకూరు మండలంలోని చిన్నయ్యగారిపల్లికి చేరుకున్నారు. అక్కడ శివ, సాంబయ్యలను ప్రశ్నించే క్రమంలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో పలువురు జోక్యం చేసుకొని ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుల్, ముగ్గురు గొర్రెల విక్రయదారులపై కర్రెలతో దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఎస్‌ఐ సతీష్ తలకు గాయం కాగా, గొర్రెల విక్రయదారుడు టేకులపల్లి అంజయ్య చేతి బొటన వేలు విరగ్గా, వీరు వచ్చిన వాహనాన్ని సైతం ధ్వంసం చేశారు. భయభ్రాంతులకు గురై మైదుకూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. మైదకూరు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేసినట్లు సమాచారం.



టేకులపల్లి అంజయ్య

డబ్బులు ఇవ్వకుండా దాడి చేశారు : టేకులపల్లి అంజయ్య,

గ్రామంలోని ఓ వ్యక్తి ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాంబయ్య, అతని కుమారుడు శివలతో పరిచయం ఏర్పడింది. దీంతో వారికి మా ఊళ్లోని ఎనిమిది మంది గొర్రెలు విక్రయించారు. మేము వేరొకరి వద్ద గొర్రెలు తీసుకొచ్చి విక్రయిస్తే డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. విడతల వారీగా డబ్బులు చెల్లిస్తానని చెప్పి రేపు, మాపు అంటూ తిప్పించుకున్నాడు. మాకు గొర్రెలు ఇచ్చిన వారి నుంచి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి పెరగడంతో మేము గొర్రెలు అమ్మిన సాంబయ్య, శివలను ఎన్నిసార్లు అడిగినా రేపు, మాపు అంటూ తిప్పించుకున్నారు. దీంతో చేసేది లేక చందంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాం. గురువారం మేము ఎస్‌ఐ, పోలీసులతో కలిసి చిన్నయ్యగారిపల్లి ఊరికి వెళ్లి డబ్బుల విషయమై అడుగుతుండగా కొందరు వచ్చి మాపై, పోలీసులపై దాడి చేసి, మా వాహనాన్ని ధ్వంసం చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర

రాజాపేట : మండలంలోని చిన్నమేడారం, యాదాద్రి మేడారం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో మూడు రోజులుగా కొలువుదీరిన వనదేవతలు సమ్మక్క సారలమ్మల వనప్రవేశంతో జాతర శనివారం సాంప్రదాయ బద్ధంగా ముగిసింది. అమ్మవార్లను దర్శనం చేసుకోవడానికి మూడు రోజులుగా జిల్లా నలుమూలల నుంచి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఆయా పార్టీల నాయకులే కాకుండా ఇతర జిల్లాల నుండి వేలాది మంది భక్తులు వచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు వడిబియ్యాలు, గాజులు, కుంకుమ, పసుపు, కొబ్బరికాయలతో మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేసి తిరుగు ప్రయాణం చేసారు. చివరిరోజు సాంప్రదాయ బద్ధంగా ఆలయ పూజారులు, నిర్వాహకులు కలిసి డప్పు వాయిద్యాలతో, మేళతాళాలతో వనదేవతలను వనప్రవేశం చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వంచ వీరారెడ్డి, చింతల పరిమళ సపంత్, జూకంటి మమత బాలస్వామి, వైస్ ఎంపీపీ కాయితి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాపోలు కవిత తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



చిన్నమేడారంలో దేవతలను వనప్రవేశం చేయిస్తున్న నిర్వాహకులు

విశ్వంభర సినిమా షూటింగ్ సందడి



చిరంజీవికి జ్ఞాపికను అందజేస్తున్న వజ్రతేజ రైస్ మిల్లు యాజమాన్యం



సన్నివేశంలో పాల్గొన్న చిరంజీవి

హాలియా : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పాలెం సమీపంలో ఉన్న వజ్రతేజ రైస్ ఇండస్ట్రీస్ మిల్లులో మెగాస్టార్ చిరంజీవి నటించనున్న విశ్వంబర సినిమా షూటింగ్ జరిగింది. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వశిష్ట దర్శకత్వంలో నిర్మించనున్న విశ్వంభర సినిమా షూటింగ్‌లోని కొన్ని సన్నివేశాలను శనివారం వజ్రతేజ రైస్ మిల్లులో చిత్ర యూనిట్ సభ్యులు చిత్రీకరించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన విశ్వంభర సినిమా షూటింగ్ సన్నివేశాలు రాత్రి వరకు నిర్వహించారు. వజ్రతేజ రైస్ మిల్లులో విశ్వంబర సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను హీరో చిరంజీవితో పాటు సినీ ఆర్టిస్టులు రాజా రవీంద్ర, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, హర్షవర్ధన్, ప్రవీణ్, రోహన్, అకుల్, కుసుం, ప్రత్యూష సింగం శెట్టి, నాగరాజు, రాహుల్‌పై చిత్రీకరించారు. హీరో చిరంజీవి మిల్లు యజమానిగా, హమాలీలు ట్రాక్టర్లు, లారీలపై ఉన్న ధాన్యం దిగుమతి చేసే సన్నివేశాలను చిత్రీకరించారు. వజ్రతేజ రైస్ మిల్లులో ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు, మెగాస్టార్ చిరంజీవి నటించనున్న విశ్వంబర సినిమా షూటింగ్ జరుగుతున్న విషయం తెలుసుకున్న సాగర్ నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అభిమానులను నివారించడానికి హాలియా సీఐ రాఘవరావు, హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావుతో పాటు ముందుగానే ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.



వజ్రతేజ రైస్‌మిల్లులో విశ్వంభర సినిమా షూటింగ్ సన్నివేశాలు

ప్రాణం తీసిన ఆర్టీసీ బస్సు

- బస్సులో నుంచి జారిపడి యువకుడు దుర్మరణం
- మృతుడు చింతపల్లి మండలం కుర్మేడు వాసి



రమేష్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: పనులు చేసుకొని ఇంటికి తిరిగి వెల్దామని అనుకున్నాడు. బస్సు ఎక్కి ఇంటికి వెళ్తుండగా బస్సులో నుంచి జారీ పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడుకు చెందిన నదిరి రమేష్ నల్లల పిట్టింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. ప్రతి రోజు కుర్మేడ్ నుంచి తుర్కయంజాల్‌తో పాటు నగరానికి వచ్చి పనులు చేసుకొని ఇంటికి తిరిగి వెళ్తుంటాడు. రోజులాగే శనివారం పని పూర్తి చేసుకొని తుర్కయంజాల్‌లో రాత్రి 7గంటల సమయంలో దేవరకొండ డిపో బస్సు ఎక్కాడు. అక్కడి నుంచి ఆరకిలో మీటరు దాటక ముందే బస్సులో ప్రయాణికుల రద్దీగా ఉండటం వలన ఫుట్‌పాత్ వద్ద ఉన్న రమేష్ కాలు జారీ బస్సు కింద పడిపోయాడు. దీంతో బస్సు అతనిపై నుంచి వెళ్లింది. సంఘటన స్థలంలోనే రమేష్(36) మృతిచెందినట్లు గుర్తించారు. ఆర్టీసీ డ్రైవర్ అంజనేయులు నిర్లక్ష్యం వల్లే జరిగిందని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య చెప్పారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ. 25 లక్షల విలువ గల పరికరాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట క్రైం : అంతర్ రాష్ట దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట డీఎస్పీ గొల్లూరి రవి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సౌండ్ సిస్టంకు సంబంధిచిన ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించారు. వాహనంలో ఉన్న అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన కుర్ర తుల్సాను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగిలించిన వస్తువులు అని ఒప్పుకున్నాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారించగా కోదాడ పట్టణానికి చెందిన దరావత్ బాలకృష్ణ, బర్మావత్ గురు చరణ్, నల్లగొండకు చెందిన రమావత్ వంశీ లతో కలిసి దొంగతనాలకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నాడన్నారు. నిందితుడు కుర్ర తుల్స హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవిస్తూ వచ్చే డబ్బులు సరిపోక తన స్నేహితులైన కోదాడకు చెందిన బాలకృష్ణ అలియాస్ సిద్దు, గురు చరణ్ అలియాస్ గురులతో కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి పూట ఫంక్షన్ హాల్ లలో, డీజే షాప్ ల ముందు ఉంచిన డీజే సౌండ్ సిస్టమ్‌లను దొంగిలించి వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. నిందితులు ముందుగా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో గల లాంగ్ డ్రైవ్ కార్స్‌లలో కారులను కిరాయికి తీసుకోని అక్కడి నుంచి బయలుదేరి గత సంవత్సరం నవంబర్ నెల నుంచి మాచర్ల, సూర్యాపేట, కోదాడ, చిలుకూరు, చివ్వెంల ప్రాంతాల లో రాత్రి పూట సంచరిస్తూ ఫంక్షన్ హాల్ లలో, డీజే షాప్ ల ముందు ప్రోగ్రామ్ చేసి వచ్చాక పార్కింగ్ చేసిన వాహనాలలో నుంచి ఆంప్లిఫయర్లు, మిక్సర్లు, క్రాస్ ఓవర్స్, లను దొంగిలించి వాటిని ఒక దగ్గర దాచి పెట్టి వీలు కుదిరినప్పుడు వేరే ప్రాంతాలకి తీసుకోని వెళ్ళి విక్రయించాలనుకున్నారు. ఒక వాహనాన్ని కిరాయికి తీసుకుని వాటిలో దొంగిలించిన డీజే సౌండ్ సిస్టమ్ వస్తువులను తరలిస్తుండగా జనగాం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక వాహనం అనుమానాస్పదంగా వెల్లుతుండగా దానిని ఆపి తనిఖీ చేయగా అందులో గల వ్యక్తి ని విచారించగా, అతను మాచర్ల, సూర్యాపేట, కోదాడ, చిలుకూరు, చివ్వెంల లలో చేసిన దొంగతనాలు ఒప్పుకోగా పంచనామా జరిపి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి 25 లక్షల విలువగల సౌండ్ సిస్టమ్స్ కు సంభందించిన ఎలక్ట్రానిక్ పరికరాలు 27- ఆంప్లిఫయర్లు, 7 క్రాస్ ఓవర్స్, 6మిక్సర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం శివారులో ఘటన



యల్లమ్మ (ఫైల్)

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం శివారు గోపాల్ రెడ్డినగర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన గంట ముత్తయ్య తన కుటుంబీకులు, తన అత్తగారి కుటుంబీకులతో కలిసి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం కలాన్‌మాధవరంలో శనివారం సాయంత్రం శుభకార్యానికి తన ఆటోలో కలిసి వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ముత్తయ్యతో పాటు ఆయన భార్య యల్లమ్మ (42), తిమ్మాపురంనకు చెందిన తన బావమరిది బొడ్డు లక్ష్మణ్, అతని భార్య యల్లమ్మ, వదిన బొడ్డు స్వరూపతో పాటు వారి పిల్లలతో ఆటోలో మాధవరం వెళుతుండగా గోపాల్‌రెడ్డినగర్ వద్ద తిరుమలగిరి నుంచి సూర్యాపేట వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటో బోల్తాపడి నుజ్జునుజ్జు అయింది. ఆటోలో పయనిస్తున్న గంట ముత్తయ్య భార్య యల్లమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. కాగా ఈ ఆటోలో శుభకార్యానికి వెళుతున్న, లక్ష్మణ్, యల్లమ్మ, స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా వీరి చిన్న పిల్లలు ప్రమాదం నుంచి బయట పడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఇందనూరి మహేందర్ నాథ్ సందర్శించి వివరాలను తెలుసుకొని రోడ్డుపై బోల్తాపడిన ఆటోను తొలగించి వేయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా మృతురాలు యల్లమ్మ కోడూరులో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆమె భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


చికిత్స పొందుతున్న చిన్నారి మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా ఎస్.పోలవరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే నరేష్, వ్యాపారం చేసుకునే మహేందర్‌లు కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. కుటుంబాలు కలిసి ఒకే కారులోతమ స్వగ్రామానికి వెళ్లారు. ఆ క్రమంలో తిరిగి వస్తుండగా ఈనెల 20న అర్ధరాత్రి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పంచాయతీ మదిర బొర్రోళ్లగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ముందున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులోని వ్యక్తులంతా గాయపడ్డారు. గాయపడిన నరేష్ కుమార్తె నిఖేత(3) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

మేడారం టు యాదాద్రి




స్వామివారి దర్శనానికి ముఖమండపంలో వేచి ఉన్న భక్తులు



ప్రసాదం కౌంటర్‌ల వద్ద క్యూలైన్‌లలో బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మేడారం భక్తులు సందడి చేస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయిలో జరుగుతున్న వన దేవతలు సమ్మక్క సారలమ్మ జాతరకు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధికంగా తరలివెళ్లారు. వారంతా ఇప్పుడు అమ్మవార్లను అక్కడ దర్శించుకొని, తిరుగు ప్రయాణంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాలతో పాటు కొండ కింద గల తులసీ కాటేజీ, పాత గోశాల ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. సమ్మక్క, సారలమ్మలను దర్శనం చేసుకొని, తిరుగు ప్రయాణంలో యాదాద్రీశుడిని దర్శించుకున్న అనంతరం వన భోజనాలు చేయడం సంప్రదాయంగా వస్తుంది. ఆ సంప్రదాయం ప్రకారం పలువురు భక్తులు పాత గోశాలతో పాటు ఆయా ప్రాంతాల్లోని చెట్ల కింద గూడారాలు ఏర్పాటు చేసుకొని, వన భోజనాలు చేస్తూ ఆనందంగా గడుపుతున్నారు. భక్తులు అధికంగా స్వామి వారి ఆలయానికి రావడంతో దర్శనానికి 3గంటల సమయం పడుతుంది. శ్రీస్వామిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి నిత్యాదాయం రూ. 30,63,104 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



పాత గోశాలలోని చెట్ల కింద సేదదీరుతున్న భక్తులు